www.aksharadarbar.com
మంగళవారం 21, మే 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :92 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 05

కేయూలో ఉద్రిక్తత

వీసీ దిష్టిబొమ్మ శవయాత్ర.. దగ్ధం..

కాకతీయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేయూ వైస్ ఛాన్స్ లర్ తాటికొండ రమేష్ కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీసీ దిష్టిబొమ్మతో క్యాంపస్ లో శవయాత్ర నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందు వీసీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

– అక్షర దర్బార్, హనుమకొండ

03

మున్సిపాలిటీగా కేసముద్రం!?

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే మున్సిపాలిటీగా ప్రకటించే అవకాశం
- మార్గదర్శకాలు సిద్ధం చేయాలని స్థానిక అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ?

03

ఇన్ని రోజులు గ్రామపంచాయతీ, మేజర్ జీపీ ఇప్పుడు మున్సిపాలిటీగా మారబోతుందట. రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గ చర్యలను తీసుకోనుందట. దీంతో ఆ గ్రామ పరిధిలోని ప్రజలకు ఎంతవరకు మేలు జరుగుతోంది. ఎంత నష్టం జరగబోతుందనేది ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ తతంగం పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా అవతరించబోతోంది. మండలంలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు కానీ.. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోకి మరికొన్ని గ్రామాలను తీసుకొని మున్సిపాలిటీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు పావులు కదుపుతోంది. అందుకు తగ్గ మార్గదర్శకాలు సిద్ధం చేయాలని ఇప్పటికే జిల్లా అధికారులు, స్థానిక అధికారులకు ఆదేశాలు వచ్చినట్టుగా తెలుస్తోంది.

– కేసముద్రం, అక్షర దర్బార్

ముంపు నివారణకు

రూ.158కోట్లు

- భద్రకాళి బండ్ వరకు బొంది వాగుకు రక్షణ గోడలు
- కాపువాడ మత్తడి నుంచి అలంకార్ వరకు కూడా రిటైనింగ్ వాల్స్
- మత్తళ్ల వద్ద గేట్ల ఏర్పాటు
- పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- త్వరలో పనులు చేపట్టేందుకు సన్నాహాలు

వరద ముంపు నివారణకు ప్రభుత్వం రూ.158.06 కోట్లు మంజూరు చేసింది. 2016 నుంచి ప్రతి ఏటా వర్షాలతో నగరంలోని పలు కాలనీ నీట మునుగుతున్నాయి. 2023లో ఎన్నడూ లేని విధంగా నగరం నీట మునిగింది. ప్రజలకు ఎంతో ఆస్తి నష్టం జరిగింది. ఈ క్రమంలో ముంపు నివారణకు ప్రభుత్వం సిద్ధమై నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కు ఉన్నతాధికారులు లేఖ రాసి అనుమతి పొందారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. పోలింగ్ ముగిశాక చర్యలు చేపట్టాలని ఈసీ షరతు విధించింది. దీంతో ఈనెల 14న ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది. ముంపు నివారణకు చేపట్టాల్సిన పనుల టెండర్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. టెండర్ దక్కించుకున్న వారు రెండు మూడు రోజుల్లో అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ పనులను నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్నారు. పనులు వేగంగా పూర్తి చేయడానికి యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. వరద ముంపు నుంచి కాపాడటానికి సర్కార్ తీసుకున్న నిర్ణయం పట్ల నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదలకు విశేష కృషి చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సహకారం అందించిన నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

02

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

రేవ్ పార్టీ కేసులో ఐదుగురి అరెస్టు

- పార్టీలో పాల్గొన్న నటి హేమ
- బెంగళూరు సిటీ పోలీస్ కమిషనర్ వెల్లడి

05

నో టెస్ట్ డ్రైవ్..

- డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల్లో మార్పులు
- జూన్ ఒకటి నుంచి నయా రూల్స్

04

బోనస్ సన్న వడ్లతో మొదలు

- చివరి గింజ వరకు కొంటాం
- డిప్యూటీ సీఎం భట్టి

05

కేయూ ఇన్ చార్జ్ వీసీగా ఐఏఎస్ వాకాటి కరుణ

- ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం
- ఉపకులపతి నియామకం వరకు బాధ్యతలు

03

- భద్రకాళీ బండ్ వరకు బొంది వాగుకు రక్షణ గోడలు
- కాపువాడ మత్తడి నుంచి అలంకార్ వరకు కూడా రిటైనింగ్ వాల్స్
- మత్తళ్ల వద్ద గేట్ల ఏర్పాటు
- పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- త్వరలో పనులు చేపట్టేందుకు సన్నాహాలు

ముంపు నివారణకు రూ.158కోట్లు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

వరద ముంపు నివారణకు ప్రభుత్వం రూ.158.06 కోట్లు మంజూరు చేసింది. 2016 నుంచి ప్రతి ఏటా వర్షాలతో నగరంలోని పలు కాలనీ నీట మునుగుతున్నాయి. 2023లో ఎన్నడు లేని విధంగా నగరం నీట మునిగింది. ప్రజలకు ఎంతో ఆస్తి నష్టం జరిగింది. ఈ క్రమంలో ముంపు నివారణకు ప్రభుత్వం సిద్ధమై నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కు ఉన్నతాధికారులు లేఖ రాసి అనుమతి పొందారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. పోలింగ్ ముగిసాక చర్యలు చేపట్టాలని ఈసీ షరతు విధించింది. దీంతో ఈనెల 14న ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది. ముంపు నివారణకు చేపట్టాల్సిన పనుల టెండర్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. టెండర్ దక్కించుకున్న వారు రెండు మూడు రోజుల్లో అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ పనులను నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్నారు. పనులు వేగంగా పూర్తి చేయడానికి యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. వరద ముంపు నుంచి కాపాడటానికి సర్కార్ తీసుకున్న నిర్ణయం పట్ల నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదలకు విశేష కృషి చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సహకారం అందించిన నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

బొంది వాగుకు రక్షణ గోడలు

వరదలు వచ్చినప్పుడు బొంది వాగు ఉప్పొంగి పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఈ ముంపు నుంచి ప్రజలను కాపాడటానికి విడుదలైన నిధులతో బొంది వాగుకు రక్షణ గోడలు (రిటైనింగ్ వాల్స్) నిర్మించనున్నారు. హంటర్ రోడ్డు అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ నుంచి భద్రకాళీ బండ్, గాయత్రి గుడి వరకు బొంది వాగుకు ఇరువైపుల రక్షణ గోడలు కట్టనున్నారు. గాయత్రి గుడి వద్ద సాధ్యాసాధ్యాలను బట్టి బ్రిడ్జి గాని, రెగ్యులేటర్ గానీ నిర్మిస్తారు. కాపువాడ మత్తడి ప్రాంతం నుంచి అలంకార్ ప్రాంతం వరకు 600మీటర్లు కూడా ఇరుపక్కల రిటైనింగ్ వాల్స్ నిర్మించనున్నారు. వరద వచ్చినప్పుడు వాగు ద్వారా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఈ నిర్మాణం చేపట్టనున్నారు. వాగులోకి చేరిన నీరు సమీప కాలనీలోని ఇండ్లలోకి చేరకుండా ఈ నిర్మాణం దోహదపడుతుందని నీటి పారుదల శాఖ ఈఈ ఆంజనేయులు, డీఈ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

కాపువాడలో గేట్ల ఏర్పాటు

వరద నివారణ చర్యల్లో భాగంగా కాపువాడలో గేట్లు నిర్మించడానికి సిద్ధమయ్యారు. కాపువాడ మత్తడి వద్ద గేటెడ్ స్ట్రక్చర్ నిర్మించనున్నారు. నీరు ఎక్కువైనప్పుడు గేట్లు తెరిచి నీటిని పంపించే విధంగా, నీరు తక్కువగా ఉన్నప్పుడు గేట్లు వేసే విధంగా కాపువాడ మత్తడి ప్రాంతంలో నూతన నిర్మాణం జరగనుంది. దీంతో సమీప ప్రాంతాల వాసులకు వరద బెడద నుంచి తప్పించే వీలుందని నీటి పారుదలశాఖ అధికారులు వెల్లడించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే పోతన నగర్, రామన్నపేట, కాపువాడ, హంటర్ రోడ్డులోని సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్ నగర్, గాయత్రి కాలనీ తదితర ప్రాంతాలకు వరద ముంపు నుంచి ఇబ్బందులు తొలగనున్నాయి.

అధికారులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంచాలకులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ పి. గోపి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. గోపి అధికారులను ఆదేశించారు. మంగళవారం వర్ధన్నపేట మండలం ఇల్లందలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు గురించి రైతులతో ఆయన నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జూన్ మొదటి వారంలోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందశాతం కొనుగోళ్లు పూర్తి కావాలని, ఎక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని గోపి అధికారులతో చెప్పారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ ధాన్యం అమ్మిన రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈప్రక్రియ వందశాతం పూర్తయ్యేలా అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. 14,158.80 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని ,అదేవిధంగా ఖరీఫ్ 2023-24 లో 14,992 క్వింటాళ్ల ధాన్యం 275 మంది రైతుల నుండి సేకరించి 3.28 కోట్ల రూపాయలు చెల్లించామని అధికారులు గోపికి వివరించారు.

మహిళల స్వయం ఉపాధికి

కుట్టు మిషన్లు దోహదం

వరంగల్ జిల్లా డీఆర్డీవో కౌసల్యా దేవి

దుస్తులను పరిశీలిస్తున్న కౌసల్య దేవి

అక్షర దర్బార్, చెన్నారావుపేట : మహిళలు స్వశక్తితో స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ కేంద్రాలు ఎంతగానో దోహద పడతాయని డీఆర్డీవో కౌసల్య దేవి అన్నారు. మంగళవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాలను ఆమె సందర్శించారు. అనంతరం మండలంలోని అమీనాబాద్, జల్లి గ్రామాల్లో గ్రామ సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసుకున్న మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ ను ఆయా మండలాల మహిళలతోనే కుట్టించాలని, మహిళలు సమిష్టిగా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని కుట్టడం ద్వారా పనిలోని మెళకువలను పొందవచ్చని అన్నారు. మహిళల్లో మరింత నైపుణ్యం కోసం ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. కుట్టు పరికరాల కోసం రుణాలను కూడా మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర, కోఆర్డినేటర్ మంజుల, వీవోఏలు అస్మా, పర్వీన్, రమ, కోమల పాల్గొన్నారు.

మహనీయుడు రాజీవ్ గాంధీ

పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

అక్షర దర్బార్, నర్సంపేట : దేశం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. మంగళవారం భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, ముఖ్య నాయకులు నూనె పద్మ, వేముల సారంగం గౌడ్, దుడేలా సాంబయ్య, మెరుగు సాంబయ్య, ఇస్లావత్ పద్మ బాయి, ఆడెపు రామాదేవి, నాడెం నాగేశ్వర్, మోటం రవికుమార్, గాజుల రమేష్, లాక్కార్స్ రమేష్, పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి, గీరగాని రమేష్, పుల్లూరి చిన్న రవి, కొల్లూరి శ్రీహరి, గడ్డమీద తిరుమల్, గోపు మహేందర్ రెడ్డి, బిట్ల మనోహర్, మైదం రాకేష్, దేశి సాయి పటేల్, తక్కళ్లపెల్లి ఉమ, బాణాల ప్రసన్న, గద్ద జ్యోతి, నాకినబోయిన అమల, దేశి లక్ష్మీ, వజీనపెల్లి శారద తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

సంగెంలో..

అక్షర దర్బార్, సంగెం : రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా సంగెం మండల కేంద్రంలో రాజీవ్ చిత్ర పటానికి ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సంభర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆధునిక భారతదేశానికి పునాదులు వేసి, అణగారిన బతుకుల్లో వెలుగు నింపి, ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బతికిన మహానేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో సంగెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, యాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగపాటి రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండేటి రాజు, నాయకులు గుండేటి శ్రీకర్, పులి సాంబయ్య, అప్పల కవిత, ఆగపాటి రామకృష్ణ, మునుకుంట్ల మోహన్, నల్లతీగల రవి, ఎండీ షకీల్, చెల్కలపెల్లి అనిరుధ్, పవన్ కార్తీక్, ఎండీ ఖాజా పాషా, పెంతల ప్రతాప్, జన్న యాకయ్య, మెట్టుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మున్సిపాలిటీగా కేసముద్రం?

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు

- స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ప్రకటించే అవకాశం
- మార్గదర్శకాలు సిద్ధం చేయాలని స్థానిక అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు?

అక్షర దర్బార్, కేసముద్రం : ఇన్ని రోజులు గ్రామపంచాయతీ, మేజర్ జీపీగా ఉన్న కేసముద్రం ఇప్పుడు మున్సిపాలిటీగా మారబోతుంది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన చర్యలను తీసుకోనుందని సమాచారం. దీంతో.. ఆ గ్రామ పరిధిలోని ప్రజలకు ఎంతవరకు మేలు జరుగుతోంది, ఎంత నష్టం జరగబోతుందనేది ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ తతంగం పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా అవతరించబోతుంది. మండలంలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు కానీ.. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోకి మరికొన్ని గ్రామాలను తీసుకొని మున్సిపాలిటీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు పావులు కదుపుతోంది. అందుకు తగ్గ మార్గదర్శకాలు సిద్ధం చేయాలని ఇప్పటికే జిల్లా అధికారులకు, స్థానిక అధికారులకు ఆదేశాలు వచ్చినట్టుగా తెలుస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కేసముద్రం మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా అవతరించనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసముద్రంలో మున్సిపల్ పరిధిగానే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. కేసముద్రం మున్సిపాలిటీగా మారితే ఏవిధమైన శాఖాపరమైన మార్పులు చోటు చేసుకుంటాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇక కేసముద్రం మేజర్ గ్రామ పంచాయతీలో 14 వార్డులు ఉన్నాయి. 3,216 నివాసాలు ఉండగా.. 12,904 మంది పౌరులు ఉన్నారు. మున్సిపాలిటీగా మార్చే క్రమంలో చుట్టు పక్కల గ్రామాలను కేసముద్రంలో కలిపే అవకాశాలు ఉన్నాయి. అవి అన్నీ కూడా వార్డు కౌన్సిల్‌గా మారనున్నాయి. దీంతో పట్టణ పరిధి పెరగడంతో పాటు వార్డుల సంఖ్య కూడా పెరగనుంది.

మున్సిపాలిటీతో లాభాలు...

కేసముద్రం మున్సిపాలిటీగా మారితే ఎన్నో లాభాలు ఉన్నాయి. స్థానికంగా ఉన్నటువంటి వ్యవసాయ మార్కెట్‌కు ప్రాధాన్యత పెరగనుంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో పేరొందిన ఈ మార్కెట్‌కు మున్సిపాలిటీ అనంతరం.. అధిక ప్రాధాన్యత రానుంది. అదే విధంగా.. స్థానికంగా ఏ సమస్య వచ్చినా కౌన్సిలర్లు పరిష్కరించే అవకాశం ఉంది. మున్సిపాలిటీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో మౌళిక వసతుల కల్పన పెరగనుంది. మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కూడా అధికమొత్తంలో నిధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. దీంతో.. వెనుకబడిన కౌన్సిల్ వార్డులకు రహదారుల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి వసతి, పారిశుధ్య నిర్వహణ అన్ని క్రమబద్ధంగా జరిగే అవకాశాలు ఉంటాయి. కేసముద్రం ప్రజల స్థితిగతులు కూడా మారే అవకాశాలు మెండుగా ఉంటాయి. విద్యా, వైద్య సౌకర్యాలు మెరుగుపడుతాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి విస్తరించే అవకాశం ఉంది. మున్సిపల్ కమిషనర్ కేసముద్రంకు రానున్నారు. ఏ సమస్య వచ్చినా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లే సౌలభ్యం ఉంటుంది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కూడా పకడ్బందీగా ఉంటుంది. కూరగాయల మార్కెట్ నిర్వహణకు ప్రత్యేకంగా ప్రదేశం నిర్ణయిస్తారు.

పెరగనున్న పన్నుల భారం..

కేసముద్రం మున్సిపాలిటీగా అవతరిస్తే కలిగే లాభాలతో పాటు.. స్వల్పంగా నష్టాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా ఏ నిర్మాణం చేపట్టాలన్నా మున్సిపల్ పర్మిషన్ అవసరం. గతంలో ఉన్న పన్నుల కంటే.. మున్సిపాలిటీగా మారిన అనంతరం పన్నుల భారం పెరగనుంది. నేడు ఒక ప్లాట్‌లో ఇంటి నిర్మాణానికి రూ.3వేలు ఉంటే.. మున్సిపాలిటీ అయ్యాక.. పురపాలక సంఘం నిర్ణయించే ధరను చెల్లించాల్సి ఉంటుంది. సంత పన్ను కూడా పెరుగుతుంది. ట్యాక్స్ వసూళ్ల భారం పెరుగుతోంది. అదేవిధంగా ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా మున్సిపాలిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పోలీసుల పర్మిషన్‌తో మున్సిపాలిటీ పర్మిషన్ తప్పనిసరి కానుంది.

యూనివర్సిటీలకు ఇన్చార్జి వీసీల నియామకం

అక్షర దర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలోని 10 విశ్వవిద్యాలయాలకు ఇన్ ఛార్జీ వైస్ చాన్స్ లర్లుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీసీల నియామకంపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించిన విషయం తెలిసిందే. పూర్తిస్థాయి ఉపకులపతుల నియామకం అయ్యేంత వరకు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ఇన్ చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 10 యూనివర్సిటీలకు ఐఏఎస్ లను నియమించింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇన్ ఛార్జి వీసీగా దాన కిషోర్, జేఎన్‌టీయూ కు బుర్రా వెంకటేశం, కేయూకు వాకాటి కరుణ, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి రిజ్వీ, తెలంగాణ వర్సిటీ ఇన్ ఛార్జి వీసీగా సందీప్ సుల్తానియా, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి శైలజ రామయ్యర్, మహాత్మా గాంధీ యూనివర్సిటీకి నవీన్ మిట్టల్, శాతవాహన యూనివర్సిటీకి సురేంద్ర మోహన్, జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీకి జయేష్ రంజన్, పాలమూరు యూనివర్సిటీకి నదీం అహ్మద్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

భూయజమాని ఒకరు.. పట్టా మరొకరికి..

అధికారుల తీరును నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన

అక్షర దర్బార్, చిల్పూర్: భూ యజమానికి పట్టా జారీ చేయకుండా మరొకరికి రెవెన్యూ అధికారులు పట్టా జారీ చేయడంపై అసలైన యజమానులు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన ఘటన మంగళవారం చిల్పూర్ లో జరిగింది. అక్రమ పట్టాను నిరసిస్తూ బాధిత కుటుంబ సభ్యులు పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశారు. అక్రమ పట్టా ఎలా చేశారంటూ తహసీల్దార్ సరస్వతిని నిలదీశారు. ఘటనా స్థలానికి ఎస్సై ముత్యం రాజేందర్ చేరుకుని అక్రమ పట్టాను రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో భూ యజమానులు ఆందోళన విరమించారు. రెవెన్యూ అధికారుల తీరును మండల ప్రజలు తీవ్రంగా తప్పుపట్టారు.

కరెంట్ షాక్ తోవ్యక్తి మృతి

అక్షర దర్బార్, హనుమకొండ: కరెంట్ షాక్ తో ఒకరు మృతిచెందగా మరో ముగ్గురు గాయపడిన ఘటన మంగళవారం వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. ఎన్ఐటీ సమీపంలోని బ్లూ జిమ్ సెంటర్ బిల్డింగ్ పైన ఐరన్ బోర్డు విప్పుతుండగా బోర్డ్ స్లిప్ అయి 11 కేవీ తీగల మీద పడిపోయింది. ఈ ప్రమాదంలో విజయ్ అనే వ్యక్తి మృతి చెందాడు. రాము, విష్ణు, సందీప్ అనే మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు.

బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్నను గెలిపించండి

కాంగ్రెస్ బీసీ సెల్ సంగెం మండల అధ్యక్షుడు గోపతి రవి యాదవ్

అక్షర దర్బార్,సంగెం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సంగెం మండల అధ్యక్షుడు గోపతి రవి యాదవ్ పిలుపునిచ్చారు. సామాన్య ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు.

కేయూలో ఉద్రిక్తత

వీసీ దిష్టిబొమ్మతో శవయాత్ర.. దహనం

అక్షర దర్బార్, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేయూ వైస్ చాన్స్ లర్ తాటికొండ రమేష్ కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీసీ దిష్టిబొమ్మతో క్యాంపస్ లో శివయాత్ర నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందు వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వీసీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేయూలో వీసీ రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. కాగా, మంగళవారంతో వీసీ రమేష్ పదవీ కాలం ముగియడంతో కొన్ని కీలకమైన ఫైళ్లు మాయం చేశారని విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీసీ అవినీతిపై విచారణ జరపాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పలు విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో ఇప్పటికే ప్రభుత్వం కేయూ వీసీ రమేష్ పై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు కేయూలో ఆందోళన చేయడం చర్చనీయాంశమైంది.

కేటీఆర్ ను కలిసిన వాసుదేవారెడ్డి

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను హైదరాబాదులో మంగళ వారం బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి పూర్తి సహకారం అందించాలని, గెలుపు కోసం సమష్టిగా పనిచే యాలని వాసుదేవారెడ్డికి కేటీఆర్ సూచించారు. భవిష్యత్తులో పార్టీలో సముచితమైన స్థానం ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

కేటీఆర్ ను కలిసిన వాసుదేవారెడ్డి

సీఈఐఆర్ పోర్టల్‌తో సత్ఫలితాలు

-వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : నూతన సాంకేతికత సీఈఐఆర్ తో సత్ఫలి తాలు సాధిస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఎవరైనా తమ సెల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వెబ్ సైట్ లో వివరాలు నమోదు చేస్తే పోయిన సెల్ ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని సీపీ వివరించారు. నూతనంగా వినియోగంలోకి వచ్చిన సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా పోగొట్టు కున్న 142 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని వాటిని యజమానులకు పోలీస్ కమిషనరేట్ లో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మంగళవారం అందజేశారు. టెలికాం మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వెబ్ సైట్ ఎంతగానో ఉపయోగక రంగా ఉందన్నారు. ఎవరైతే మొబైల్ ఫోన్ పొగోట్టుకున్నారో వారు మొదట అదే నెంబర్ తో నూతన సిమ్ తీసుకొని, మీ సేవలో మొబైల్ లాస్ట్ అప్లికేషన్ దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి www.ceir.gov.in వెబ్ సైట్ లో వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు.

పొగొట్టుకున్న మొబైల్ ను తిరిగి యువతికి అందజేస్తున్న సీపీ

నో టెస్ట్ డ్రైవ్

డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల్లో మార్పులు

జూన్ ఒకటి నుంచి నయా రూల్స్

అక్షర దర్బార్, హైదరాబాద్: కొత్తగా మీరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అనుకుంటున్నారా? అయితే మీకు శుభవార్త. ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్ నిబంధ నల్లో పలు మార్పులు చేసింది. ఈ కొత్త నిబంధ నలు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అందువల్ల ఇకపై మీరు ఆర్టీవో ఆఫీసుకు వెళ్లి టెస్ట్ డ్రైవ్ చేయాల్సిన అవసరం ఉండదు. కొత్త రూల్స్ ప్రకారం, ఇకపై మీరు డ్రైవింగ్ టెస్ట్ కోసం ఆర్టీఓ ఆఫీస్కు వెళ్లాల్సిన పనిలేదు. ఆర్‌టీఓ ఆఫీసుకు బదులుగా, ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్ల వద్దనే డ్రైవింగ్ టెస్టుకు హాజరుకావచ్చు. వారు డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించి మీకు ఒక సర్టిఫికేట్ ఇస్తారు. దానితో మీరు ఆర్టీఓ ఆఫీస్ నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చు. ఈ నూతన రూల్స్ ఈ జూన్ 1 నుంచే అమలులోకి వస్తాయి. ఈ కొత్త నిబంధనల ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, డ్రైవింగ్ లైసెన్స్ కోసం అప్లై చేసేవాళ్లు, నేరుగా ఆర్‌టీఓ ఆఫీసులకు వెళ్లాల్సిన అవసరాన్ని తొలగించడం. పూర్తిగా ఆన్లైన్లోనే డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయడం.

శిక్షణా కేంద్రం ఏర్పాటుకు...

ప్రైవేట్ డ్రైవింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలంటే, దానికి కూడా పలు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసమైతే ఒక ఎకరం భూమి ఉండాలి. ఫోర్-వీలర్ డ్రైవింగ్ ట్రైనింగ్ కోసం అయితే మరో 2 ఎకరాల భూమి అదనంగా ఉండాలి. ఇలా అన్ని రకాల ఫెసిలిటీస్ కలిగి ఉన్న ప్రైవేట్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లకు ప్రభుత్వం లైసెన్స్ జారీ చేస్తుంది. ఈ ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్లలో ఉన్న ట్రైనర్లు కనీసం డిప్లొమా చేసి ఉండాలి. అలాగే కనీసం 5 ఏళ్ల డ్రైవింగ్ ఎక్స్పీరి యెన్స్ ఉండాలి. బయోమెట్రిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిస్టమ్స్పై కనీస అవగాహన ఉండాలి. లైట్ మోటార్ వెహికల్ ట్రైనింగ్ నాలుగు వారాల్లో లేదా కనీసం 29 గంటల్లో పూర్తి చేయాలి. ఈ శిక్షణ థియరీ, ప్రాక్టికల్ విధానాల్లో ఉండాలి. థియరీ కోసం కనీసం 8 గంటలు, ప్రాక్టికల్ కోసం కనీసం 21 గంటలు కేటాయించాలి. హెవీ మోటార్ వెహికల్స్ అయితే 6 వారాలు లేదా కనీసం 38 గంటలపాటు శిక్షణ ఉండాలి. థియరీ ఎడ్యుకేషన్ 8 గంటలు, ప్రాక్టికల్స్ 31 గంటలు ఉండాలి.

ఫీజులు ఇవే

అమలుకానున్న ఫీజులు లెర్నర్ లైసెన్స్ రూ.200. లెర్నర్ లైసెన్స్ రెన్యువల్ రూ.200. ఇంటర్నేషనల్ లైసెన్స్ రూ.1000. పర్మినెంట్ లైసెన్స్ రూ.200. పర్మినెంట్ లైసెన్స్ రెన్యూవల్ రూ.200. డ్రైవింగ్ స్కూల్ లైసెన్స్ జారీ, రెన్యువల్ – రూ.10,000. డ్రైవింగ్ స్కూల్ డూప్లికేట్ లైసెన్స్ – రూ.5000. డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయడానికి ముందుగా https://parivahan.gov.in. వెబ్ పోర్టల్ ఓపెన్ చేయాలి. హోమ్‌పేజీలోని "డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు" ఆప్షన్పై క్లిక్ చేయాలి. వెంటనే అప్లికేషన్ ఫారమ్ ఓపెన్ అవుతుంది. అవ సరమైతే దాని ప్రింట్అవుట్ తీసుకోవాలి. దరఖాస్తు ఫారమ్లో అడిగిన వివరాలు అన్నీ నమోదు చేయాలి. అవసరమైన అన్ని డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలి. అక్కడున్న సూచనల ప్రకారం దరఖాస్తు రుసుము చెల్లించాలి. ప్రాధాన్యతను బట్టి ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత, అవసరమైన పత్రాలతో ఆర్టీఓ ఆఫీస్కు వెళ్లాలి. డ్రైవింగ్ నైపుణ్యాన్ని రుజువు చేసే ఆధారాలను ఆర్టీఓకు చూపించాలి. డ్రైవింగ్ స్కిల్స్ పెర్ఫెక్ట్గా ఉన్నట్లయితే, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు.

జరిమానాలు

కొత్త నిబంధనల ప్రకారం, దాదాపు 9 లక్షల పాత ప్రభుత్వ వాహనాలను దశలవారీగా తొలగిస్తారు. పర్యావరణ కాలుష్యం తగ్గించడమే దీని లక్ష్యం. ఎవరైనా మితిమీరిన వేగంతో బండి నడిపితే రూ.1000 నుంచి రూ.2000 వరకు జరిమానా విధిస్తారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడిన ట్లయితే రూ.25 వేలు జరిమానా విధిస్తారు. సదరు వాహన యజమాని డ్రైవింగ్ రిజిస్ట్రేషన్ కార్డును రద్దు చేస్తారు. పట్టుబడిన మైనర్కు 25 ఏళ్ల వయస్సు వచ్చేంత వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడం ఉండదు.

అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏకశిలా కాలేజీ ముందు ఏఐఎస్ బీ ధర్నా

నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌బీ నాయకులు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: వరంగల్ పోచమ్మ మైదాన్ లోని వేణురావు కాలనీలో అనుమతి లేకుండా నడుస్తున్న ఏకశిల జూనియర్ కళాశా లను సీజ్ చేయాలని ఏఐఎస్ బీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రోహిత్ , ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతి లేకుండా నగర నడిబొడ్డున దర్జాగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఏకశిలా కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నడుస్తున్న ఏకశిలా బ్రాంచ్ ను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సీజ్ చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, నితిన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట చెరువులో వింత చేప

అక్షర దర్బార్, సంగెం : సంగెం మండలం ఎల్గూర్ రంగంపేట చెరువులో వింత చేప లభ్యమైంది. మత్స్యకారులు చెరువులోకి మంగళ వారం చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మత్స్య కారుడు బోనాల మహేందర్ వలలో ఈ వింత చేప చిక్కింది. వలను వెంటనే ఒడ్డుకు తీసుకెళ్లగా మామూలు చేపలతో పాటు వింత చేప దర్శనమిచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీగా తరలివచ్చి ఆసక్తిగా తిలకిం చారు. రిజర్వాయర్ నుండి చెరువులోకి వచ్చే నీటితో వింత చేపలు వస్తున్నట్లు మత్స్యకారులు తెలిపారు. చూసేందుకు చేప భయానకంగా ఉండడంతో తినేందుకు గ్రామస్తులు నిరాసక్తత వ్యక్తం చేశారు.

ఈసెట్ ఫలితాల్లో వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించే ఈసెట్-2024 పరీక్షలో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి 10 ర్యాంకులు సాధించినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎన్.దీక్షిత్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్, పి.వివేక్ 4, బి.హేమశ్రీ 9, పి.నాగసాయి యశ్వంత్ 19వ ర్యాంక్ సాధించగా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లో రాష్ట్ర స్థాయిలో ఎం.నవ్యశ్రీ 1వ ర్యాంక్, వి.వైష్ణవ్ 2, వి.అర్షిత 5, కె.హర్షిత 6, పి.హారిక 7, ఎండీ.సోహైల్ 11వ ర్యాంక్ సాధించారన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజ నీరింగ్ విభాగంలో టి.శ్రీవాత్సవ్ 2వ ర్యాంక్, ఎం.కౌ శిక్ కుమార్ 4వ ర్యాంక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో కె.చందు 2వ ర్యాంక్, కె.అఖిల్ 6, బి.ని ఖిల్ 10, ఓ.గౌతమ్ 12వ ర్యాంక్ సాధించారని ప్రభాకర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

అక్షర దర్బార్,వరంగల్ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ నగరంలోని సాయి కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ.. రాజకీయాలు ఎప్పుడూ ఒకే తీరుగా ఉండవని అధికార పార్టీలో మంది ఎక్కువగా ఉంటారని ఆ పరిస్థితి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి వచ్చిందని తాము అధికారంలో ఉన్నప్పుడు కూడా తమ పార్టీలో ఎక్కువ మంది ఉండేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీఅభ్యర్థి గురించి అందరికీ తెలుసునని, అతడు ఎంతోమందిని బెదిరించి డబ్బులు వసూలు చేశాడని సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డి సౌమ్యుడు, ఎంతోమందికి సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై నిరుత్సాహంగా ఉన్నారని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని నమ్మకం ఉందని సంజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ హరి రమాదేవి, నీలం రాజ్ కిషోర్, మసూద్, దిడ్డి కుమారస్వామి, శ్రీమాన్, మరుపల్లి రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కేటీఆర్ సదస్సును విజయవంతం చేయండి

అక్షర దర్బార్, దుగ్గొండి: పట్టాభద్రుల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నర్సంపేటలో నిర్వహించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సదస్సును విజయవంతం చేయాలని దుగ్గొండి మండల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ శానబోయిన రాజ్ కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని రాజ్య తండ, మధిర, చాపల బండ, మందపల్లి, గిర్నిబావి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని మెదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్ రావు, సీనియర్ నాయకుడు గుండెకారి రంగారావు, గోనె రాజు, చాంద్ పాషా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి

అక్షర దర్బార్, ఖనాపురం : మోడీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ అన్నారు. మంగళవారం వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోసం ఖానాపూర్ మండలం బుధరావుపేట గ్రామం 146వ బూత్ లో పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు జల్లి మధు, బూడిద ముకేశ్, నాయకులు యాకసాయన్న, తవుటి రమేష్, ఎర్ర కళ్యాణి, ఈసం లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్, హేమంత్, కిరణ్, కుమార స్వామి, రవి వర్మ, మహేందర్, విజయ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట అక్షర దర్బార్ : పట్టభద్ర ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నర్సంపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి తీన్మార్ మల్లన్న అని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పెండం రామానంద్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో నోడల్ అధికారులు, పోలీస్, పీవోలు,ఏపీవోలు, ఓపీవోలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఉపఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 12,535 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందు కోసం 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు అవినాష్, శామ్యూల్, ఆర్డీవో మంగిలాల్, డీఎస్పీ సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొంటాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

అక్షర దర్బార్, హైదరాబాద్: ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కంటే ఈసారి 7,215 కొనుగోలు కేంద్రాలను ఎక్కువగా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం కంటే తామే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశామన్న భట్టి, అబద్ధాలు చెప్పడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. ఈ మేరకు మంగళవారం గాంధీ భవన్లో మాట్లాడిన డిప్యూటీ సీఎం బీఆర్ఎస్ నేతల తీరుపై ధ్వజమెత్తారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కొనలేదని, తాము అలాంటి ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించి కొంటామని భట్టి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరగకుండా చూస్తామని, చివరి గింజ వరకు కొంటామని విక్రమార్క స్పష్టం చేశారు. ధాన్యం సేకరించిన అనంతరం మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్న ఆయన, అన్నదాతలెవరూ అధైర్యపడొద్దని, ధైర్యంగా, నిశ్చింతగా ఉండాలని కోరారు. రూ.500 బోనస్ సన్న ధాన్యానికే అని విపక్షాలు విమర్శిస్తున్నాయన్న భట్టి విక్రమార్క సన్న వడ్లకే రూ.500 బోనస్ అనలేదని అన్నారు. రూ.500 బోనస్ సన్న వడ్లతో మొదలు పెడుతున్నామని స్పష్టం చేశారు. ఇది ప్రజల ప్రభుత్వం. ప్రజలకు ఇబ్బందులు రానివ్వదు. తడిచినా, మొలకెత్తినా చివరి గింజ వరకూ కొంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

రేవ్ పార్టీ కేసులో ఐదుగురు అరెస్టు

- పార్టీలో పాల్గొన్న నటి హేమ

- బెంగళూరు సిటీ పోలీస్ కమిషనర్ వెల్లడి

అక్షర దర్బార్, బెంగళూరు: బెంగళూరు నగర శివారు ప్రాంతంలోని ఓ ఫామ్ హౌస్ లో నిర్వహించిన రేవ్ పార్టీ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు బెంగళూరు నగర పోలీసు కమిషనర్ బి.దయానంద్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మంగళవారం బెంగళూరు సిటీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు సహాయ నటి హేమ కూడా పాల్గొన్నారని తెలిపారు. అయితే ప్రజాప్రతినిధుల ప్రమేయం మాత్రం లేదని ఈ సందర్భంగా కమిషనర్ స్పష్టం చేశారు. సీసీబీ పోలీసులు, స్థానిక పోలీసులు నగర శివారు ప్రాంతంలో పార్టీ జరుగుతుందని తెలిసి దాడులు నిర్వహించారని చెప్పారు. మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్ సహాయం తీసుకున్నట్లు వివరించారు. ఈ పార్టీలో వంద మందికి పైగా పాల్గొన్నారని, ఈ దాడిలో మత్తు పదార్థాలను గుర్తించామని అన్నారు. కొందరు తాము వాడుతున్న డ్రగ్స్ ను స్విమ్మింగ్ పూల్ తో పాటు ఇతర ప్రాంతాల్లో విసిరేశారని కమిషనర్ చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి ఎలక్ట్రానిక్ సిటీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశామని అన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. కాగా, ఆ పార్టీలో తాను లేనని సహాయ నటి హేమ సోమవారం ఒక వీడియోను విడుదల చేశారు.